సాక్షి
వికారాబాద్
ఆదివారం । 2 । ఏప్రిల్ । 2023




'సోషల్' అడ్డా
జిల్లాలోని ప్రజాప్రతినిధులు, చోటామోటా లీడర్లు సైతం సొంత సోషల్ మీడియా టీంను ఏర్పాటు చేసుకుంటున్నారు. 8లో▸



ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు
ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. 8లో▸



సబ్సిడీకి మంగళం!
వ్యవసాయ రాయితీ పథకాలు ఒక్కొక్కటిగా కనుమరుగవుతుండడంతో అన్నదాతల ఆశలు నీరుగారిపోతున్నాయి. 9లో▸



పోషకాల బియ్యం

ఈనెల నుంచే రేషన్ షాపుల ద్వారా పంపిణీ

- ఏర్పాట్లు చేస్తున్న పౌర సరఫరాల శాఖ
- గర్భిణుల్లో రక్త హీనత, చిన్నారుల్లో ఎదుగుదల లోపాలకు చెక్
- జిల్లాలోని సుమారు ఎనిమిది లక్షల మందికి లబ్ధి



వికారాబాద్ అర్బన్: చౌక ధర దుకాణాల ద్వారా ప్రజలకు అందిస్తున్న బియ్యానికి బదులు ఫోర్టిఫైడ్ రైస్ పంపిణీకి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ప్రజలందరికీ పోషకాలతో కూడిన బియ్యం అందించాలనే ఉద్దేశంతో రాష్ట్రంలోని ఏడు జిల్లాలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేయగా.. ఇందులో వికారాబాద్‌కు చోటుదక్కింది. ఇప్పటికే జిల్లాలోని కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలకు ఫోర్టిఫైడ్ రైస్ అందజేస్తున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఏప్రిల్ నెల కోటాలో లబ్ధిదారులందరికీ ఇదే బియ్యం ఇవ్వాలని నిర్ణయించారు. సాధారణ బియ్యంలాగే ఉండే ఈ పోర్టిఫైడ్ రైస్‌లో ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి- 12 నిర్ణీత మోతాదులో ఉంటాయని అధికారులు చెబుతున్నారు. ఈ బియ్యాన్ని ఆహారంగా తీసుకోవడం వల్ల గర్భిణుల్లో రక్తహీనత దూరమవుతుంది. చిన్నారుల్లో వయసుకు తగిన ఎదుగుదల ఉంటుంది.

2,41,264 రేషన్ కార్డులు

జిల్లాలోని 588 షాపుల ద్వారా 2,41,264 రేషన్ కార్డులకు బియ్యం సరఫరా చేస్తున్నారు. ఇందులో అంత్యోదయ కార్డులు 26,698, అన్నపూర్ణ 36 కార్డులు ఉన్నాయి. మొత్తం 8లక్షల మంది లబ్ధిదారులు బియ్యం తీసుకుంటున్నారు. వీరికి ప్రతి నెల సుమారు 4,62,700 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేస్తున్నారు.

కృత్రిమ విధానంలో..

ఫోర్టిఫైడ్ బియ్యం అంటే పోషకాలతో కూడిన బియ్యం. ఇప్పటికే మహిళా, స్త్రీశిశు సంక్షేమ శాఖ ద్వారా అంగన్‌వాడీల్లోని చిన్నారులకు ఈ బియ్యంతో వండిన భోజనం వడ్డిస్తున్నారు. ఆహార పదార్థాల్లో పోషక లోపాన్ని గుర్తించి, కృత్రిమ విధానంలో పోషకాలను కలిపే ఈ ప్రక్రియను ఫోర్టిఫికేషన్ అంటారు. విటమిన్ బి- 12, ఫోలిక్‌యాసిడ్, ఐరన్ వంటి పోషకాలను నిర్ణీత మోతాదులో ఇందులో కలుపుతారు. ఇవి సాధారణ బియ్యం మాదిరిగానే కనిపిస్తాయి. రైతులు పండించిన ధాన్యాన్ని బియ్యంగా మార్చే క్రమంలో ఎక్కువగా పాలిష్ చేయడంతో నూక, తవుడు రూపంలో పోషకాలు వెళ్లిపోతాయి. ఇలాంటి బియ్యాన్ని తినడం ద్వారా శరీరానికి ఎలాంటి పోషకాలు అందవు. ఈ కారణంగానే గర్భిణుల్లో రక్తహీనత, చిన్నారుల్లో ఎదుగుదల లోపం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. వీటిని అధిగమించేందుకు విటమిన్ బి- 12, ఫోలిక్ యాసిడ్, ఐరన్ పోషకాల మిశ్రమం కలిగిన కృత్రిమ బియ్యాన్ని తయారు చేస్తున్నారు. దీంతో బియ్యంలో కావాల్సిన పోషకాలు ఉండటంతో ప్రజలు ఆరోగ్యంగా ఉండటంతో పాటు, ప్రభుత్వ లక్ష్యం కూడా నెరవేరనుంది.

ఏర్పాట్లు చేస్తున్నాం

ఈనెల నుంచి పోర్టిఫైడ్ బియ్యం పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే అంగన్‌వాడీలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి ఇవే బియ్యాన్ని సరఫరా చేస్తున్నాం. బలవర్ధకమైన బియ్యంతో ప్రజలకు ఉపయోగం ఉంటుంది.

– విమల, సివిల్ సప్లయ్ డీఎం



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

రోడ్ల పనులు పూర్తిచేయండి

- కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశం
- కాంట్రాక్టర్లు, అధికారులతో సమీక్ష

వికారాబాద్ అర్బన్: రెండు మాసాల్లో పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ రోడ్ల పనులను పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ మేరకు అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి శనివారం తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటికే మంజూరైన రోడ్ల పనులను వచ్చే వారంలో తప్పనిసరిగా ప్రారంభించాలన్నారు. అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో, అంకిత భావంతో పనిచేసి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. మంజూరైన అన్ని పనులు వర్షాకాలంలోపు పూర్తి చేయాలన్నారు. పనుల నిర్వహణ విషయంలో అధికారులు, సిబ్బంది నుంచి పూర్తి సహకారం అందుతుందని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కాంట్రాక్టర్లకు సూచించారు. పనులు చేసేందుకు అవసరమైన ఇసుక, కంకర సేకరణకు వీలుగా సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు.

పెండింగ్ జాబితా పరిశీలించండి..

జిల్లా వ్యాప్తంగా సీడీపీ, ఎస్డీఎఫ్, ఎంపీ ల్యాండ్స్, సీబీఎఫ్ నిధులతో చేపట్టిన పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీఓలను ఆదేశించారు. మండలాల వారీగా పెండింగ్ పనుల జాబితాను తీసుకొని పనుల్లో వేగం పెంచాలని తెలిపారు. సంబంధిత ఏఈలతో సమీక్ష నిర్వహించాలన్నారు. మే31 నాటికి 80శాతం పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. మన ఊరు- మనబడి పనులకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ నిర్దేశించిన గడువులోపు పనులు పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే 42 పాఠశాలలకు సంబంధించిన పెయింటింగ్ అంచనాలను రూపొందించి మంగళవారం సాయంత్రంలోపు ప్రపోజల్స్ సమర్పించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా, మండల స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు వీలుగా వాట్సప్ గ్రూపులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వీటిలో తనతో పాటు అదనపు కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులు, కాంట్రాక్టర్లను, తహసీల్దార్లు, ఏఈలు, పంచాయతీ కార్యదర్శులను చేర్చాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ దరఖాస్తులను వారం రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పీఆర్ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్అండ్‌బీ ఈఈ లాల్‌సింగ్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి నిరంజన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

అంబాభవానీ జాతర షురూ



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

బషీరాబాద్: మండలంలోని దామర్‌చెడ్ భవానీ నగర్‌లో వెలసిన అంబాభవానీ మాత 49వ జాతర ఉత్సవాలు శనివారం ఉదయం అట్టహసంగా ప్రారంభయ్యాయి. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పదుల సంఖ్యలో దంపతులు మహాభిషేకాలు నిర్వహించారు. రాత్రి వేళ సిద్ధిలింగయ్య స్వామి ప్రవచణ కార్యక్రమం కొనసాగింది. పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు భవానీ మాతకు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పీఠాధిపతి శ్రీశంకర్ స్వామీజీ ఆధ్వర్యంలో సంబరాలు కొనసాగుతున్నాయి.

కర్ణాటక సరిహద్దులో భద్రత కట్టుదిట్టం

తాండూరు: కర్ణాటక ఎన్నికల సందర్భంగా అంతర్రాష్ట్ర సరిహద్దులో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. గత బుధవారమే ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో కన్నడ పోలీసులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. మే 10న పోలింగ్ పూర్తయ్యే వరకు వీటిని కొనసాగిస్తారు. 13న ఫలితాలు వెలువడనున్నాయి. కర్ణాటక రాష్ట్రం తెలంగాణతో పలుచోట్ల సరిహద్దు కలిగి ఉంది. దీంతో తాండూరు మండల ప్రాంతంలోని జాతీయ రహదారిపై కొత్లాపూర్ వద్ద, మైల్వార్ సరిహద్దు, అడ్కితోపాటు కొడంగల్, వికారాబాద్ నియోజకవర్గాల పరిధిలోని బోర్డర్లలోనూ కర్ణాటక పోలీసులు చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. ఆయా మార్గాల్లో రాకపోకలు సాగిస్తున్న వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు.

ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణ గడువు పెంపు

దోమ: ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణ దరఖాస్తు గడువును ఈనెల 30 వరకు పొడిగించినట్లు తహసీల్దార్ షాహెదాబేగం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జీఓ నంబర్ 58, 59 ప్రకారం గ్రామాల్లో నివాసముంటున్న ప్రజలు ఇంటి యాజమాన్య హక్కు పత్రాన్ని పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పరిశీలన పూర్తి చేసిన తర్వాత ఇంటి యాజమాన్య హక్కు పత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు.

మోదీ పాలనలోనే దేశం అభివృద్ధి



తాండూరులోని పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న కరుణగోపాల్

తాండూరు: ప్రధాని నరేంద్ర మోదీతోనే దేశం వేగంగా అభివృద్ధి చెందుతోందని బీజేపీ మహిళా మోర్చా జాతీయ కన్వీనర్ కరుణగోపాల్ అన్నారు. పార్టీ ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక నాయకులతో కలిసి పట్టణంలో పర్యటించారు. అంగన్‌వాడీ కేంద్రంలో సదుపాయాలను పరిశీలించారు. ఆశ వర్కర్లతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. డిగ్రీ కళాశాలకు చేరుకుని కొత్తగా ఓటరు గుర్తింపు పొందిన విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం యాలాల మండలంలో పర్యటించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మహిళా మోర్చా నేతలతో సమావేశం నిర్వహించారు. అనంతరం యాలాల మండల పర్యటనకు బయల్దేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలు సాహుశ్రీలత, నాయకులు యు.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు వందల్లో.. దరఖాస్తులు వేలల్లో!



దరఖాస్తు కేంద్రాల వద్ద ప్రజల సందడి

- తాండూరులో డబుల్ బెడ్‌రూం ఇళ్లకు 9,436 అప్లికేషన్లు
- పంపిణీకి సిద్ధంగా 581 ఇళ్లు

తాండూరు: పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం చేపట్టిన దరఖాస్తుల గడువు ముగిసింది. గత నెల 27వ తేదీ నుంచి శనివారం వరకు ప్రజల నుంచి అప్లికేషన్లు స్వీకరించారు. ఇందుకోసం తాండూరు మున్సిపాలిటీలో 6 వార్డులు ఏర్పాటు చేశారు. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ప్రక్రియ కొనసాగింది. మొత్తం 9,436 మంది దరఖాస్తు చేసుకున్నారని తహసీల్దార్ చిన్నప్పలనాయుడు ధ్రువీకరించారు. వీటిని వార్డుల వారీగా విభజించి కలెక్టర్‌కు పంపిస్తామని తెలిపారు.

ప్రజాప్రతినిధులు సైతం..!

గూడు లేని పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకోసం మున్సిపాల్ పరిధిలో 1,050 ఇళ్ల నిర్మాణం చేపట్టింది. ఇందులో ఇప్పటి వరకు 581 పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. డబుల్ బెడ్‌రూం ఇళ్ల మంజూరు సమయంలో మున్సిపాలిటీ నుంచి 7వేల దరఖాస్తులు అందాయి. ప్రస్తుతం వీటి సంఖ్య 9,436కి చేరింది. పట్టణంలో మొత్తం 14 వేల గృహాలున్నాయి. ఇదిలా ఉండగా తాండూరు మున్సిపాలిటీలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోవడం గమనార్హం.

పరమత సహనం పాటించాలి

- అన్ని పండుగలను కలిసిమెలిసి జరుపుకోవాలి
- అడిషనల్ ఎస్పీ మురళీధర్
- తాండూరులో పీస్ కమిటీ సమావేశం
- శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని పిలుపు
- సోషల్ మీడియాలో వదంతులను నమ్మొద్దని యువతకు సూచన



శాంతి సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ మురళీధర్

తాండూరు టౌన్: ప్రజలందరూ మత సామరస్యాన్ని పాటించాలని అడిషనల్ ఎస్పీ పీవీ మురళీధర్ అన్నారు. రానున్న హనుమాన్ ర్యాలీ, భద్రప్ప జాతర, రంజాన్ పండుగలను పురస్కరించుకుని శనివారం స్థానిక తులసీ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో శాంతి సమావేశం నిర్వహించారు. తాండూరు సబ్ డివిజన్ పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీటింగ్‌లో హిందూ ఉత్సవ కేంద్ర సమితి, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో పాటు పలు రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాల ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులమతాలు వేరైనా ప్రజలంతా ఒక్కటేనని, ఏ మతానికి సంబంధించిన పండుగలనైనా అందరూ కలిసిమెలిసి శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. ప్రతిఒక్కరూ పరమత సహనం పాటించాలని, ఎల్లవేళలా పరస్పర స్నేహ హస్తం అందించుకోవాలన్నారు. వేడుకల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసు శాఖ గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తోందని స్పష్టంచేశారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు వార్తలు, వదంతులను నమ్మవద్దని యువతకు సూచించారు. అవాస్తవాలను ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఎస్పీ శేఖర్ గౌడ్ మాట్లాడుతూ.. అనుమానిత వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. పండుగల నేపథ్యంలో ఇతరులకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న మాట్లాడుతూ.. పర్వదినాల సందర్భంగా మున్సిపల్ శాఖ తరఫున భక్తులకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తామన్నారు. హిందూ ఉత్సవ కేంద్ర సమితి సభ్యులు, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, మత పెద్దలు, రాజకీయ నేతలు మాట్లాడుతూ..తాండూరులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తమవంతు బాధ్యతను నిర్వర్తిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్, హిందూ ఉత్సవ కేంద్ర సమితి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల నర్సింహులు, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఖుర్షీద్ హుస్సేన్, కమాల్ అథర్, పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డి, పలు మండలాల ఎస్ఐలు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనే శ్రీరామ రక్ష

- ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి సబితారెడ్డి

కందుకూరు: కేసీఆర్ నాయకత్వం మరోసారి రాష్ట్రానికి అందేలా కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని సామ నర్సింహారెడ్డి ఫంక్షన్ హాల్‌లో శనివారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రానికి కేసీఆర్ పాలనే శ్రీరామ రక్ష అని, వేరే పార్టీ వస్తే కుక్కలు చింపిన విస్తరిలా మారుతుందన్నారు. ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. మిషన్ భగీరథ పథకం కింద కందుకూరు, మహేశ్వరం మండలాల్లోనే రూ.280 కోట్లు ఖర్చు పెట్టామన్నారు. భూములు అమ్ముకోవద్దని రాబోయే కాలంలో ఈ ప్రాంతం మరో హైటెక్ సిటీ కానుందన్నారు. బీజేపీ వాట్సాప్ యూనివర్సిటీ ద్వారా అబద్ధాలను సృష్టిస్తూ ప్రచారం చేస్తోందని విమర్శించారు. ప్రధాని మోదీ ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు, ప్రతి వ్యక్తి ఖాతాలో రూ.15 లక్షల సొమ్ము జమ చేస్తామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు.

పండుటాకుల పడిగాపులు



ప్రభుత్వం అందజేస్తున్న సామాజిక పెన్షన్ డబ్బుల కోసం లబ్ధిదారులు పడిగాపులు కాస్తున్నారు. శనివారం ఉదయం 9గంటలకే మంబాపూర్ పంచాయతీ కార్యాలయానికి చేరుకున్న వృద్ధులు పోస్ట్ మాస్టర్ కోసం మధ్యాహ్నం ఒంటి గంట వరకు వేచిచూశారు. తిండీతిప్పలు లేక పైసల కోసం చూస్తున్నామని తెలిపారు. ఇదిలా ఉండగా ఇప్పటివరకు ప్రతినెల 5వ తేదీలోపు పింఛన్లు అందజేసిన ప్రభుత్వం మార్చినుంచి నెలాఖరు రోజునే పంపిణీ చేస్తోంది.

– పెద్దేముల్

మళ్లీ విఫలం!

- ఈజీఎస్ నిధుల వినియోగంలో మరోసారి తడబాటు
- ఈఏడాది కూడా అసంపూర్తిగానే మిగిలిన పనులు
- ముగిసిన 2022- 23 ఆర్థిక సంవత్సరం గడువు
- 65 పనులు అసంపూర్తిగానే ఆగిపోయిన వైనం
- రూ.60.96 కోట్లలో ఖర్చుపెట్టింది రూ.54.35 కోట్లే
- ప్రత్యేక అనుమతి తెస్తామంటున్న అధికారులు



ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు

వికారాబాద్: ఆర్థిక సంవత్సరం 2022- 23తో పాటు.. పూర్తి చేయాల్సిన అభివృద్ధి పనుల గడువు కూడా ముగిసింది. ఉపాధి హామీ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు అలాగే మిగిలిపోయాయి. ఇదిలా ఉండగా మిగిలిన పనులకు సంబంధించి ఉన్నతాధికారులతో చర్చించి 2023- 24 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించేలా అనుమతులు తీసుకువస్తామని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. మిగిలిన పనులను పూర్తి చేసేందుకు అనుమతి తీసుకోవటం.. పూర్తి చేసిన పనులకు సంబంధించి బిల్లులు రాబట్టడం ఎంత కష్టమో గత అనుభవాలు కళ్లకు కడుతూనే ఉన్నాయి. గతేడాది ఇదే తరహాలో మార్చిలో మిగిలిపోయిన పనులకు సంబంధించి అనేక ప్రయాసలకు ఓర్చి అనుమతులు తీసుకున్న అధికారులు ఏప్రిల్ మాసంలో పనులు పూర్తిచేశారు. కానీ వీటి బిల్లులు మాత్రం ఇప్పటికీ క్లియర్ కాలేదు.

రూ.60.96 కోట్ల నిధుల మంజూరు

2022- 23 ఆర్థిక సంవత్సరంలో జిల్లాకు ఉపాధి హామీ పథకంలో భాగంగా మెటీరియల్ కాంపొనెంట్ కింద ప్రభుత్వం 717 పనులు మంజూరు చేసింది. ఇందులో 715 సీసీ రోడ్లు, ఒకటి సైడ్ డ్రెయిన్, మరొకటి మెటల్ రోడ్డు ఉంది. ఈ పనులు చేపటటేందుకు రూ.60.96 కోట్ల నిధులు మంజూరు చేసింది. వీటిలో అధిక శాతం సీసీ రోడ్లే ఉన్నాయి. అయితే గత వారం రోజుల క్రితం వరకు ఈ పనుల్లో 70 శాతం పూర్తి కాగా గడిచిన వారం రోజుల్లో హడావుడిగా మరో 20శాతం పనులు పూర్తిచేశారు. ఆర్థిక సంవత్సరం ముగియటంతో పనులు చేపట్టేందుకు ఇచ్చిన గడువు కూడా ముగిసింది. ఇప్పటి వరకు రూ. 54.35 కోట్లతో 652 పనులు పూర్తవగా మరో 65 అసంపూర్తిగా మిగిలాయి.

రూ.4.5 కోట్ల పెండింగ్ బిల్లులు

గతేడాది 2021- 22 ఆర్థిక సంవత్సరంలో సైతం చివరలో పనులు పూర్తి చేసేందుకు హడావుడి చేసినప్పటికీ పెద్ద సంఖ్యలో పనులు మిగిలిపోయాయి. అనంతరం ప్రత్యేక అనుమతి తీసుకుని ఏప్రిల్‌లో వీటిని పూర్తి చేశారు. కానీ పది నెలల తర్వాత కొన్ని బిల్లులు మాత్రమే చెల్లించారు. ఇంకా 62 పనులకు రావాల్సిన రూ.4.5 కోట్ల బకాయిలు పెండింగ్‌లోనే ఉన్నాయి. పనులు పూర్తి చేసి ఏడాదవుతున్నా బిల్లులు రాకపోవటంపై సర్పంచులు, ఇతర ప్రజా ప్రతినిధులు, కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు. ఈ ఏడాది కూడా మళ్లీ 65 పనులు పూర్తికాకుండానే మిగిలిపోయాయి. వీటిని కూడా గతేడాదిలాగే ఉన్నతాధికారులతో స్పెషల్ పర్మిషన్ తీసుకున్నట్లు ఆశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది కూడా పూర్తికాకుండా మిగిలిపోయిన పనులకు సంబంధించి అనుమతులు తీసుకుని పూర్తి చేసినా.. బిల్లుల చెల్లింపులలో సమస్య తలెత్తే అవకాశం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఈనెలలో పూర్తి చేస్తాం



టార్గెట్ పూర్తి చేయాలనే ఉద్దేశంతో చివర్లో కొంత హడావుడిగా పనులు చేసిన మాట వాస్తవమే. అయినా ఇంకా 65 పనులు మిగిలిపోయాయి. ఇందులో చాలా వరకు పురోగతిలో ఉన్నాయి. ఉన్నతాధికారుల నుంచి ప్రత్యేక అనుమతి తీసుకుని ఏప్రిల్ నెలలో పూర్తిచేస్తాం.

– శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్, ఈఈ

క్లుప్తంగా

వ్యక్తి అదృశ్యం


మల్లయ్య (ఫైల్)

పరిగి: దవాఖానకు వెళ్లివస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన మండల పరిధిలోని సయ్యాద్‌పల్లిలో చోటు చేసుకుంది. ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మల్లిగారి మల్లయ్య గత నెల 28న సాయంత్రం పంటి నొప్పి వస్తుందని ఆస్పత్రికి వెళ్లివస్తానని ఇంట్లో చెప్పి వెళ్లిన వ్యక్తి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబీకులు అంతటా వెతికినా ఆచూకి లభించలేదు. మల్లయ్య కుమారుడు వెంకటయ్య శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఇంటర్ పరీక్ష రాసేందుకు వెళ్లి..

ధారూరు: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష రాయడానికి వెళ్లిన విద్యార్థిని అదృశ్యమైంది. మండల పరిధిలోని గట్టెపల్లికి చెందిన చాకలి పాండు పెద్ద కూతురు (17) గత నెల 29న ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష రాయడానికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అంతటా వెతికినా ఆచూకి లభించలేదు. దీంతో తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. ఇంటి నుంచి వెళ్లినప్పుడు గోధుమ రంగు టాప్, పింక్ కలర్ ప్యాంట్ ధరించి ఉందని, ఎత్తు 4.5 ఫీట్లని వివరించారు. ఆచూకీ తెలిస్తే 87126 70033 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొడంగల్: మండల పరిధిలోని రావులపల్లిలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందాడు. ఎస్ఐ రవిగౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్నాటక రాష్ట్రం యాద్గిర్ నుంచి రావులపల్లి వస్తున్న కారు అతివేగంగా వచ్చి ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ద్విచక్రవాహనంపై ఉన్న సాయప్ప తీవ్రంగా గాయపడటంతో గుల్బర్గాలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు. ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న మరో వ్యక్తి సాయిలుకు తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

జాతీయ రహదారిపై లారీ బోల్తా

డ్రైవర్‌కు గాయాలు


బోల్తాపడిన లారీ

బొంరాస్‌పేట: మండల పరిధిలోని జాతీయ రహదారిపై వేగంగా వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. రేగడిమైలారంలో శనివారం తెల్లవారుజామున ఈ ఘటనచోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి కర్ణాటకకు మట్టిని తరలిస్తున్న 12 చక్రాల లారీ అదుపుతప్పి రేగడిమైలారం దాటుతుండగా కల్వర్టు వద్ద లోయలో పడింది. ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి.

ధారూరు మార్కెట్‌కు పోటెత్తిన వేరుశనగ

ధారూరు: స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు శనివారం 320 వేరుశనగ బస్తాలు వచ్చాయి. మార్కెట్లో జరిగిన బీట్లలో క్వింటాల్‌కు రూ. 5,400 నుంచి రూ. 7వేల వరకు అమ్మకాలు జరిగినట్లు మార్కెట్ కమిటీ తెలిపింది. కందులు క్వింటాల్‌కు రూ. 8,400 నుంచి రూ. 8,500 వరకు అమ్మకాలు జరిగాయి.

రాజకీయాల గడ్డ.. సోషల్ మీడియా అడ్డా



ప్రధాన పార్టీల నాయకుల వేదిక

- ప్రత్యేక బృందాల ఏర్పాటు
- విమర్శలు.. ప్రతివిమర్శల జోరు
- రోజంతా కొనసాగుతున్న వార్
- కార్యక్రమాలపై ఎప్పటికప్పుడు పోస్టులు

పరిగి: సోషల్ మీడియాకు ఉన్న క్రేజీ అంతా ఇంతా కాదు.. రాజకీయాలకే వేదికగా మారింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం, ట్విట్టర్ ఇలా ఏదో ఒక సోషల్‌మీడియా వేదికగా చాలా మంది ఖాతాలు నిర్వహిస్తున్నారు. ఒక్కో వ్యక్తి రోజులో సగటునా నాలుగు గంటల పాటు సామాజిక మాధ్యమాలపై గడుపుతున్నారు. అందుకే సోషల్ మీడియా ప్రధాన వారధిగా మారింది. ఈ అవకాశాలన్నీ సద్వినియోగం చేసుకునేందుకు జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ప్రధాన పార్టీల నాయకులు గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి రాజకీయ నాయకులు సోషల్ మీడియా ఖతాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. రోజువారి కార్యక్రమాలు, పర్యటనలు ఫొటోలతో డిజైన్ చేసి పోస్టు చేయిస్తున్నారు.

ప్రత్యేక బృందాలు

జిల్లాలోని వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లోని ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నాయకుల్లో కొందరు వచ్చే ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో సోషల్ మీడియాపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. అందు కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకున్నారు. నాయకుల వద్ద ఖాతాల నిర్వహణ కోసం ప్రత్యేక సిబ్బంది పనిచేస్తున్నారు. అభివృద్ధి కార్యక్రమాలు, సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న సమయంలో ఫొటోలు, ఆ అంశానికి సంబంధించిన సమాచారం పోస్టు చేయడమే వీరి పని. కొంత మంది ప్రజాప్రతినిధుల ఖాతాలను నగరం నుంచి చూస్తున్నారు. ఫొటోలు తీయడానికి ప్రత్యేక ఫొటోగ్రాఫర్లు కూడా ఉన్నారు.

ప్రత్యేక ప్యాకేజీలు

సోషల్ మీడియాలో పండుగలు, నాయకుల జయంతి, వర్ధంతి తదితర కార్యక్రమాలు, శుభాకాంక్షలు తెలియజేయడం, ప్రభుత్వం పథకాలపై పోస్టులు, ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాల పోస్టుల కోసం ప్రత్యేక ప్యాకేజీతో కొందరు పనిచేస్తున్నారు. ఆయ కార్యక్రమాల సమయంలో ప్రజా ప్రతినిధుల ఫొటోలతో డిజైన్ చేసి ఇస్తుంటారు.

కమిటీల నియామకం..

బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ సోషల్ మీడియా కమిటీలు కూడా వేశాయి. మండలం, నియోజకవర్గాల వారీగా కన్వీనర్లను, కోఆర్డినేటర్లను నియమించారు. ఆయ పార్టీల కార్యర్తలకు స్వచ్ఛందంగా పనిచేస్తూ ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో చురుగ్గా పాల్గొని పోస్టులు చేస్తూ కౌంటర్లు ఇస్తూ ఉంటారు. తమ తమ పార్టీల విధానాలను ప్రచారం చేస్తూనే ప్రత్యర్థి పార్టీలపై విమర్శలు, ప్రశ్నలు గుప్పిస్తుంటారు.

సోషల్ వేదికగా వార్

ఆయ పార్టీల నాయకులు రోజు సోషల్ మీడియా వేదికగా వార్ కొనసాగిస్తున్నారు. ఒకరిపై మరొకరు విమర్శలు గుప్పిస్తూ పోస్టులు పెడుతున్నారు. కేంద్ర ప్రభుత్వంపై బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు పోస్టులు పెడుతుంటే బీజేపీ రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ.. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఎంత నిధులు ఇచ్చింది ఏఏ పథకాలు ఇచ్చిందనే విషయాలను సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.

గ్రామ స్థాయిలో సర్వేలు

సోషల్ మీడియాతో పాటు సర్వేలు కూడా ప్రతినిత్యం చేయిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు సర్వేలు నిత్యం నిర్వహించుకుంటున్నారు. ఏఏ మండలాల్లో ఎలా ఉందనే విషయాలను ఎప్పటికప్పుడు సర్వేలు చేయించుకుని రిపోర్టు తీసుకుంటున్నారు. మండల స్థాయిలో, నియోజకర్గ స్థాయిలో ఏఏ నాయకులు ఎక్కడ తిరుగుతున్నారు? వారు పార్టీ కోసం ఎలా పనిచేస్తున్నారు? పార్టీలో కీలక పదవుల్లో ఉన్న నాయకుల వద్ద సన్నిహితంగా ఉన్నా, గ్రామ స్థాయిలో ఏవిధంగా ఉన్నారు? వారి పనితీరు ఓటర్లపై ఎంత వరకు ప్రభావితం అవుతుందనే విషయాలను నిత్యం సర్వేలు చేస్తూ ప్రజాప్రతినిధులకు అందజేస్తున్నారు. అంతే కాకా ప్రజాప్రతినిధులు ప్రజల్లో ఎలా వ్యవహరించాలి ఏవిధంగా నడుచుకోవాలి ఎలాంటి ప్రసంగాలు చేయాలనే విషయాలను కూడా వారి వివరిస్తున్నట్టు సమాచారం. సోషల్ మీడియా వారియర్లపై ప్రత్యేక దృష్టి పెట్టి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు

- పేదల కష్టసుఖాలు తెలిసిన వ్యక్తి కేసీఆర్
- ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య


మాట్లాడుతున్న ఎమ్మెల్యే యాదయ్య

నవాబుపేట: ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల పరిధిలోని ఎక్‌మామిడి గ్రామంలో సర్పంచ్ ఎండీ రఫీ అధ్యక్షతన శనివారం మండలంలోని ఎక్‌మామిడి, మూలమాడ, కేషవపల్లి, మీనపల్లికలాన్, మదారం, కడ్చర్ల, గేట్‌వనంపల్లి, మమ్మదాన్‌పల్లి, కుమ్మరిగూడ, నారెడ్డిపల్లి గ్రామాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందేలా సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, 24 గంటల విద్యుత్, పింఛన్లు తదితర పథకాలు ప్రవేశ పెట్టి అందిస్తున్నారన్నారు. గతంలో వేసవి వచ్చిందంటే తాగునీటి కోసం తిప్పలు పడేవారమని, ప్రస్తుతం భగీరథ రావడంతో ఆ పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భవానీ, జెడ్పీటీసీ జయమ్మ, ఏఎంసీ చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, సర్పంచులు సుభాన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి, అంజయ్య, రత్నం, పార్టీ మండల అధ్యక్షుడు నాగిరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సైకిల్‌ను ఢీకొన్న బైక్

ఒకరి మృతి


భీంరావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ శంకర్

బొంరాస్‌పేట: సైకిల్‌ను బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన శనివారం మండల పరిధిలోని జాతీయ రహదారిపై లింగన్‌పల్లి గేటు సమీపంలోని చోటుచేసుకుంది. వివరాలు.. కర్ణాటక రాష్ట్రం బుండెపల్లి కార్పుర్‌తండాకు చెందిన భీంరావు(35) హైదరాబాద్‌లో మేస్త్రీ పని చేసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రెండు రోజుల క్రితం తండాకు వచ్చాడు. తిరిగి వెళ్లే క్రమంలో తండాకు చెందిన చందర్‌నాయక్ ద్విచక్రవాహనంపై భీంరావ్ వెనక కూర్చున్నాడు. మండల పరిధిలోని గంగంబావితండాకు చెందిన రాములునాయక్, భార్య తులసిబాయి తమ సైకిల్‌పై పొలానికి వెళ్తున్నారు. లింగన్‌పల్లి గేటు సమీపంలో సైకిల్‌ను ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో బైక్ కిందపడగా వెనుక కూర్చున్న భీంరావ్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలినవారికి గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ పి.శంకర్ సంఘటన స్థలానికి చేరుకొని విచారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పరిగి ఆస్పత్రికి తరలించారు. మృతుడు భీంరావ్‌కు దద్దరు కూతుళ్లు, కొడుకు ఉన్నారు.

ఇమామ్‌లకు దుస్తుల పంపిణీ


దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కొడంగల్: రంజాన్ మాసం సందర్భంగా మండల పరిధిలోని మసీద్‌లలో పనిచేసే ఇమామ్, మౌసమ్‌లకు ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి శనివారం దుస్తులు పంపిణీ చేశారు. పట్టణంలోని జామా మజీద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పండుగ దుస్తులను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ముస్లింల కోసం పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. మైనార్టీ కార్పొరేషన్ నుంచి రుణాలు ఇస్తున్నట్లు చెప్పారు. స్వయం ఉపాధి కోసం పథకాలను రూపొందించినట్లు చెప్పారు. షాదీముబారక్ పథకం కింద లక్ష రూపాయల సాయం అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ మధుయాదవ్, పట్టణ మాజీ సర్పంచు రమేష్‌బాబు, మాజీ ఉప సర్పంచు గౌసన్, పర్సాపూర్ సర్పంచు అంజద్, మజీద్ కమిటీ అధ్యక్షుడు అన్వర్, బీఆర్ఎస్ నాయకులు సిద్దిలింగప్ప, మన్నాన్, నవాజొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నావంద్గీ రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలి


నిరసనలో పాల్గొన్న నాయకులు, సర్పంచులు

బషీరాబాద్: నావంద్గీ రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలని బీఆర్ఎస్ మండల నాయకులు, ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. ఎంతో కాలంగా అధికారులకు, కేంద్ర మంత్రులకు విన్నవించినా స్పందించక పోవడంతో రెండురోజులుగా ప్రజాప్రతినిధులు, నాయకులు, యువత నిరసనకు దిగారు. శనివారం జరిగిన నిరసనలో సర్పంచులు, నాయకులు మాట్లాడుతూ.. నావంద్గీ స్టేషన్ నుంచి హైదరాబాద్, బెంగళూరు, ముంబయి, పూనె వంటి నగరాలకు వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులు నిత్యం ప్రయాణిస్తుంటారన్నారు. వారి కోసం ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలని కోరారు. రైళ్లు ఆపే వరకు నిరసన కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచులు నర్సిరెడ్డి, భీమప్ప, నాయకులు జయ్‌రాంచారీ, తాహేర్‌బాండ్, పాషా తదితరులు పాల్గొన్నారు.

మహిళ దారుణ హత్య

పరిగి: ఓ మహిళ దారుణ హత్యకు గురైన ఘటన మండల పరిధిలోని రూప్‌ఖాన్‌పేట్‌లో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన శ్యామలమ్మ (50)కు పదేళ్ల క్రితం దోమ మండలం దాదాపూర్‌కు చెందిన ఓ వ్యక్తితో వివాహం జరిగింది. భర్త, కొడుకు మృతి చెందడంతో తల్లిగారి గ్రామమైన రూప్‌ఖాన్‌పేట్‌లోనే ఉంటోంది. దీంతో తలకొండపల్లికి చెందిన చంద్రమౌళితో ఎనిమిదేళ్లుగా సహజీవనం చేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఇద్దరు మద్యం మత్తులో గొడవ పడ్డారు. మద్యం మత్తులో ఉన్న చంద్రమౌళి తాడుతో గొంతు నులిమి హత్య చేశాడు. అనంతరం మృతురాలి తమ్ముడి దగ్గరకు వెళ్లి మీ అక్క పలకడం లేదని చెప్పి పారిపోయాడు. మృతురాలు తమ్ముడు ఇంటికి వచ్చి చూడగానే చనిపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. పరారైన చంద్రమౌళిని స్థానికులు పోలీసులకు పట్టించారు. కేసు దర్యాప్తు జరుగుతోంది.

చేపల వేటకు వెళ్లి ఇద్దరు మృతి

తాండూరు: చేపల వేటకు వెళ్లి ఇద్దరు మృతి చెందారు. ఈ సంఘటన తాండూరు మండలం ఖాంజాపూర్ వాగులో శనివారం చోటు చేసుకుంది. మృతులిద్దరూ తాండూరు పట్టణం సాయిపూర్‌వాసులుగా గుర్తించారు. ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సాయిపూర్‌కు చెందిన దేవరి మల్లేష్(28), నర్సింహులు ఖాంజాపూర్ శివారులోని వాగులో చేపలు పట్టేందుకు వెళ్లారు. ఈ క్రమంలో ప్రమాదశాత్తు మునిగిపోయారు. అటుగా వెళ్లిన గ్రామస్తులు గమనించి పో లీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాలను బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌కు మెమో

తాండూరు: మాంసం వ్యర్థాల సేకరణ టెండర్ విషయంలో మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా వ్యహరించారంటూ కమిషనర్ అశోక్‌కుమార్‌కు శనివారం నోటీసులు అందాయి. మున్సిపల్ పరిధిలోని మటన్, చికెన్ దుకాణాల నుంచి సేకరించిన వ్యర్థాలను హైదరాబాద్ తరలించేందుకు టెండర్ వేయాలని రెండు నెలల క్రితం మున్సిపల్ శాఖ సర్క్యులర్ జారీ చేసింది. అబ్దుల్ హమీద్, నిస్సార్ అండ్ సన్స్‌కు టెండర్ కేటాయించాల్సి ఉండగా.. మున్సిపల్ అధికారులు ఖురేషి ట్రేడర్స్‌కు కట్టబెట్టారు. ఈ విషయమై సదరు బాధితుడు మున్సిపల్ శాఖను ఆశ్రయించాడు. ఈ విషయమై వివరణ కోరుతూ ఆర్‌డీఎంఏ శ్రీనివాస్‌రెడ్డి కమిషనర్‌కు మెమో జారీ చేశారు.

అభివృద్ధికి అహర్నిశలు కృషి


మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

అనంతగిరి: ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకులు తెలిపారు. శనివారం వికారాబాద్‌లోని పార్టీ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే వర్గానికి చెందిన పలువురు నాయకులు విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే అన్ని రంగాల్లో అభివృద్ధికి కృషి చేస్తున్నారని, అందరిని కలుపుకొనిపోయి కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. కొందరు ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఎమ్మెల్యేతో ఉంటూ పదవులు పొంది ఇప్పుడు విమర్శించడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. వికారాబాద్ ప్రాంతంలో ఏ ఉద్యమ నాయకుడికి అన్యాయం జరగలేదన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధియే ధ్యేయంగా ఎమ్మెల్యే పనిచేస్తున్నారన్నారు. ఎమ్మెల్యేను విమర్శించడమే కొందరు పనిగా పెట్టుకున్నారని వారు ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ముత్యంరెడ్డి, జెడ్పీటీసీ మధుకర్, జిల్లా రైతు సమన్వయసమితి అధ్యక్షుడు రాంరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ విజయ్‌కుమార్, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పోటీతత్వం పెరగాలి


మాట్లాడుతున్న డాక్టర్ గీతనాగశ్రీ

అనంతగిరి: చదువులో పోటీతత్వం పెరగాలని అపుడే విద్యార్థులు అన్ని విధాలా రాణించేందుకు అవకాశం ఉంటుందని ప్రముఖ అంకాలజిస్టు డాక్టర్ ఎన్. గీతనాగశ్రీ అన్నారు. శనివారం వికారాబాద్ పట్టణంలోని వింటేజ్ సెంట్రల్ స్కూల్ వార్షికోత్సవం బసంత్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ విద్యార్థుల చదువుపట్ల ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా తీసుకోవాలన్నారు. విద్యార్థులకు ఆటపాటలతోనే చదువు నేర్పితే త్వరగా నేర్చుకుంటారని, సమగ్ర అవగాహన ఏర్పడుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఏరంగంలో రాణిస్తున్నారో గమనించాలన్నారు. మరింత ప్రోత్సహిస్తే ఆ రంగంలో రాణించేందుకు అవకాశం ఉంటుందన్నారు. చదువులో రాణించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ అనిత, డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ఆగడాలను సాగనివ్వం: సీపీఎం

బొంరాస్‌పేట: కేంద్ర ప్రభుత్వ ఆగడాలు సాగనివ్వొద్దని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బుస్స చంద్రయ్య పిలుపునిచ్చారు. శనివారం మండలకేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం ఆవరణలో చలో పార్టీమెంట్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ తీరుతో వ్యవసాయ కూలీల ప్రయోజనాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు, కష్ట జీవుల డిమాండ్లు పరిష్కరించాలన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఉండాలని, పింఛను రూ.10వేలు ఇవ్వాలని, అందరికీ సార్వత్రిక విద్య, ఆరోగ్యం ఉండాలని, జాతీయ విద్యావిధానం ఎన్‌ఈపీ2022ను రద్దుచేయాలనే డిమాండ్లతో చలో పార్లమెంటును విజయవంతం చేయాలని బుస్స చంద్రయ్య పిలుపు నిచ్చారు.

విద్యార్థులకు బోదకాల పరీక్షలు


చిన్నారులకు పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది

బొంరాస్‌పేట: మండల పరిధిలోని రాంనాయక్‌తండా, దుద్యాల మండల పరిధిలోని పాఠశాలల్లోని విద్యార్థులకు శనివారం ఫైలేరియా (బోదకాలు) పరీక్షలు నిర్వహించారు. పాఠశాలల్లోని 1వ, 2వ తరగతి విద్యార్థులకు, కొడంగల్ సబ్‌యూనిట్ అధికారి పకీరప్ప, టీఏఎస్ ప్రోగ్రామ్ మెడికల్ అధికారి డాక్టర్ రతన్‌లాల్ ఆధ్వర్యంలో పరీక్షలు చేశారు. బోదకాల వ్యాధిని అంచనా వేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. దోమకాటుకు గురికావొద్దన్నారు. సిబ్బంది మధుసూదన్‌రెడ్డి, చంద్రకళ, రాములమ్మ, ల్యాబ్‌టెక్నీషియన్ మహేశ్, హెచ్ఎం తేజశ్విని పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం


అవగాహన ర్యాలీలో చైర్‌పర్సన్, కమిషనర్ తదితరులు

వికారాబాద్ అర్బన్: చుట్టూ ఉన్న పరిసరాలు శుభ్రంగా ఉంటేనే మన ఆరోగ్యం బాగుంటుందని మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్ల పల్లి మంజుల అన్నారు. శనివారం కమిషనర్ శరత్ చంద్రతో కలిసి 25వ వార్డులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేరు చేసి చెత్త బండికి ఇవ్వాలన్నారు. ప్లాస్టిక్ బ్యాగులను ఎట్టి పరిస్థితి ఉపయోగించరాదని వాటి స్థానంలో జ్యూట్ బ్యాగులు, సంచులు వాడాలని సూచించారు. వికారాబాద్ పట్టణాన్ని శుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యతని గుర్తు చేశారు. ఈ సందర్భంగా మెప్మా అధికారి వెంకటేష్, ఆర్ఐ శివ, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను కించపరచడం తగదు


డైరెక్టర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న అంగన్‌వాడీలు

అనంతగిరి: దసరా సినిమాలో అంగన్‌వాడీ ఉద్యోగులు కోడిగుడ్లు దొంగతనం చేసే ఉద్యోగులుగా చిత్రీకరించిన సన్నివేశాన్ని తక్షణమే తొలగించాలని అంగన్‌వాడీ ఉద్యోగుల యూనియన్ (సీఐటీయూ అనుబంధం) జిల్లా కార్యదర్శి భారతి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మైపాల్ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం వికారాబాద్ సీడీపీఓ కార్యాలయం ఎదుట సినిమా డైరెక్టర్ బొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంటనే ఆ సన్నివేశాలను తొలగించాలన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీల మనోభావాలు దెబ్బతీసేలా చేయవద్దన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకులు లక్ష్మి, మనోహర, అన్నపూర్ణ, సుజాత, రాజేశ్వరి, పద్మ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.